
సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం ၊ 11 ၊ సెప్టెంబర్ ၊ 2023



టీటీడీ బోర్డులో బీసీలకు పెద్దపీట
తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డులో నలుగురు బీసీలకు స్థానం కల్పించడంపై బీసీ సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. 8లో



సేంద్రియ సేద్యంతో..
పంటల్లో సూక్ష్మ పోషక లోపాలను అధిగమించేందుకు రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో



9,901 కేసుల పరిష్కారం
ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 9,901 కేసులు పరిష్కారించినట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

చట్టం అందరికీ సమానమే

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



ఆకివీడు: తప్పు చేస్తే శిక్ష తప్పదని, ఎంతటివారికైనా చట్టం ఒక్కటేనని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. చంద్రబాబును సీఐడీ అరెస్ట్, రిమాండ్, జైలుకు తరలింపుపై ఆదివారం ఆయన ఆకివీడులో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించి, ప్రతిపక్ష నేతగా చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు హుందాగా ప్రవర్తించాలన్నారు. సీఐడీ వద్ద కచ్చితమైన ఆధారాలు ఉన్నాయని, దీంతోనే అరెస్ట్ చేశారన్నారు. రిమాండ్, జైలుకు తరలింపు అన్నీ చట్టప్రకారమే జరిగాయన్నారు. రిమాండ్‌కు బద్ధులై టీడీపీ నాయకులు ప్రజల జీవనానికి అడ్డుపడరాదని, విధ్వంసాలు సృష్టించవద్దని కోరారు. రాజకీయం అంటే స్వచ్ఛంగా ఉండాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దని విజ్ఞప్తి చేశారు. సీఐడీ విధానాల్ని తప్పుబట్టడం సరికాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఏ విధమైన సంబంధం లేదని రవీంద్ర స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ క్లీన్‌గా ఉందని ఇక్కడ రాజకీయ నాయకులు, కోర్టు కూడా స్వచ్ఛంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

చంద్రబాబుకు జైలు సబబే

వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి



పాలకొల్లు అర్బన్ : ప్రజాధనాన్ని దోచిన చంద్రబాబుకి జైలు శిక్ష సబబేనని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితమే చంద్రబాబు మీద ఎఫ్ఐఆర్ నమోదయ్యిందన్నారు. ఈడీ, ఐటీ, జీఎస్టీ సంస్థలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడిచేవని, చంద్రబాబు కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. సీఎం జగన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ప్రతిపక్షాలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు అరెస్ట్ విషయంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు గుండెపోటు నాటకం రక్తికట్టలేదని దుయ్యబట్టారు. నిమ్మల డ్రామాలకు త్వరలోనే అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ సచివాలయ కన్వీనర్ ఎంఎస్ వాసు, కో–కన్వీనర్ మోర్త గిరీష్, నాయకులు పాల్గొన్నారు.

ఆముదాలపల్లికి జాతీయ పురస్కారం



నరసాపురం రూరల్ : జ్యోతిష్య, వాస్తు రంగంలో సేవలందిస్తున్న మొగల్తూరుకు చెందిన ఆముదాలపల్లి వెంకటాచార్యులకు జాతీయ పురస్కారం వరించడంతో ఆ రంగంలో నంది అవార్డును అందుకున్నారు. నాలుగు రాష్ట్రాల విశ్వబ్రాహ్మణ సేవాట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన పురస్కారం తీసుకున్నారు. జిల్లా రాధారంగ మిత్రమండలి అధ్యక్షుడు తమ్మిసీడి వెంకట సత్యనారాయణ, మాలమహానాడు వెల్ఫేర్ అధ్యక్షుడు పట్టెం ముత్యాలు తదితరులు ఆయనున్న అభినందించారు.

భద్రత కట్టుదిట్టం

- చంద్రబాబుకు రిమాండ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలు
- పోలీసు బలగాల మోహరింపు
- కలపర్రు టోల్‌ప్లాజా వద్ద భారీ బందోబస్తు
- 16 వరకు కొనసాగనున్న ఆంక్షలు

ఏలూరు టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబుకు 14 రోజుల రిమాండ్ విధించిన నేపథ్యంలో ఏలూరు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ ఉన్నతాధికారులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఏలూరు నగరంతోపాటు ముఖ్య ప్రాంతాలు, టీడీపీ నేతల కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రజల శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా పోలీస్ యంత్రాంగం బందోబస్తు నిర్వహించారు.

ముందస్తు చర్యలు

చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఏలూరు డివిజన్ పరిధి, నూజివీడు ప్రాంతంలోని 12 మండలాల పరిధిలో 144 సీఆర్‌పీసీ అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈనెల 10వ తేదీ నుంచీ 16వ తేదీ వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు నలుగురు కంటే ఎక్కువ మంది బహిరంగ ప్రదేశంలో గుమిగూడి ఉండకూడదనీ, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే అధికారులు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టం మేరకు కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ఏలూరులో జాతీయ రహదారిపై మోహరించిన పోలీసులు



ఏలూరు కలపర్రు టోల్‌ప్లాజా వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

టీడీపీలో నిస్తేజం

చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేయటం, న్యాయస్థానం జ్యూడీషియరీ రిమాండ్‌కు ఉత్తర్వులు జారీ చేసినా టీడీపీ శ్రేణులు పెద్దగా స్పందించిన దాఖలాలు కనిపించలేదు. అరెస్ట్ చేసిన రోజు టీడీపీ నాయకులు సైతం మీడియా ముందు కాసేపు హడావుడి చేసి పక్కకు తప్పుకున్నారు. ఇక న్యాయస్థానంలో తీర్పు వెలువడే వరకూ టీడీపీ శ్రేణులన్నీ టీవీలకే పరిమితమయ్యాయి. ఏలూరు జిల్లాలో టీడీపీ కార్యకర్తలు సైతం ఊహించిన స్థాయిలో స్పందించలేదనే అభిప్రాయం ఉంది. చంద్రబాబును చూసుకుని రాజకీయం చేశామనీ, ఇప్పుడు ఆయనే దిక్కులేకుంటే మా పరిస్థితి ఏమిటనే డైలమాలో టీడీపీ వర్గాలు ఉన్నట్లు ఒక నాయకుడు అభిప్రాయపడ్డారు. ఏలూరు నగరంలో ఇద్దరు ప్రజాప్రతినిధులు మినహా మిగిలిన వారిలో స్పందన కరువయ్యింది. టీడీపీకి భవిష్యత్‌లో అవకాశాలు ఉండవనే అభిప్రాయంతో పార్టీ కేడర్ ఉన్నట్టు తెలుస్తోంది.

భారీ పోలీసు భద్రత నడుమ..

చంద్రబాబును విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో ఏలూరు మీదుగా రాజమండ్రి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు. రాత్రి 10.50 గంటలకు చంద్రబాబు వాహనం ఏలూరులో కలపర్రు టోల్‌ప్లాజాకు చేరుకుని రాత్రి 11.30 గంటల కల్లా ఏలూరు జిల్లా దాటింది. ఏలూరు జాతీయ రహదారిలో కలపర్రు టోల్‌ప్లాజా నుంచి జిల్లా దాటే వరకూ జాతీయ రహదారి వెంబడి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో రహదారి వెంబడి పోలీస్ బలగాలు భారీ ఎత్తున మోహరించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

చంద్రబాబు పాపం పండింది

- ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుంది
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: చంద్రబాబు చేసిన అన్యాయాలు, అక్రమాలకు పాపం పండిందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో న్యాయం గెలిచి చంద్రబాబు జైలు బాట పట్టాడని అన్నారు. చంద్రబాబు రాజకీయం జీవితమంతా వెన్నుపోట్లు, అవినీతికే అంకితమైందని, ఎన్ని తప్పులు చేసినా వ్యవస్థలను మ్యానేజ్ చేసే దిట్టగా చంద్రబాబు ముందువరసలో ఉంటారని అన్నారు. అయినప్పటికీ పాపం పండే రోజు రావడంతో నేడు చట్టం గెలిచి జైలుదారి పట్టారని విమర్శించారు. ఫైబర్ నెట్, అమరావతి భూకుంభకోణం, రింగ్ రోడ్డు, నీరు–చెట్టు ఇలా ఎన్నో స్కాంలలో కూరుకుపోయి స్టేల మీద కాలం గడిపారని, ఇప్పుడు ఆ స్టేలు ఎత్తేయడంతో ఒక్కొక్కటిగా చంద్రబాబు మెడకు చుట్టుకుంటున్నాయని స్పష్టం చేశారు. ఇది రాజకీయ కుట్ర అని చెబుతున్న చంద్రబాబు రెండెకరాల రైతుగా మొదలై రాజకీయాల్లో రూ.3 లక్షల కోట్లు ఎలా సంపాదించాడని నిలదీశారు. తానే స్వయంగా 'మోదీకే ముంది.. నేను రూ.3 లక్షల కోట్లు ఆస్థిపరుడిని' అంటూ బహిరంగ సభలో అన్నాడని గుర్తుచేశారు. ఇదే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రానున్న రోజుల్లో లోకేశ్ కూడా జైలుపాలు కాక తప్పదని చెప్పారు. పేదల కష్టాలను తెలుసుకున్న మనసున్న వ్యక్తిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో ఉన్నారని, ఆయన సృష్టించిన సంక్షేమంతో రాష్ట్రంలో పేదరికం శాతం కూడా తగ్గిందని తెలిపారు.

దత్తపుత్రుడు యాక్షన్..

ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానన్న దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను చంద్రబాబు ప్రభుత్వంలో హింసించినప్పుడు, పుష్కరాల్లో 29 మంది చనిపోవడానికి కారణమైనప్పుడు ఎందుకు బయటకు రాలేదని మంత్రి ప్రశ్నించారు. ఇప్పుడు తాజాగా చంద్రబాబును పోలీసులు అరెస్టు చేశారనగానే వచ్చి రాత్రంతా తన జనసైనికులతో జాతీయ రహదారిపై రాద్ధాంతం చేశాడని మంత్రి కారుమూరి మండిపడ్డారు. దీనిని బట్టి అతడు దత్తపుత్రుడని, ప్యాకేజీ దారుడని ప్రజలందరికీ అర్థమైందని చెప్పారు.

సానుభూతి డ్రామాలు వద్దు

తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే



బుట్టాయగూడెం: చంద్రబాబు చేసిన తప్పునకు తలదించుకోవాల్సింది పోయి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. సానుభూతి డ్రామలు కాదని తాను తప్పు చెయ్యలేదని చంద్రబాబు కోర్టులో నిరూపించుకోవాలని అన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా అవినీతిమయమేనని అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న ఆయన పాపం ఇన్నాళ్లకు పండిందన్నారు. అవినీతికి శిక్ష తప్పదని బాలరాజు అన్నారు.

సరికొత్తగా 'జగనన్నకు చెబుదాం'

- సమస్యల పరిష్కారానికి మరింత ప్రాధాన్యం
- మండల, మున్సిపల్ స్థాయిల్లో కార్యక్రమం నిర్వహణ
- నవంబర్ 15 వరకు షెడ్యూల్ ఖరారు

సాక్షి, భీమవరం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి సోమవారం కలెక్టర్, ఆర్డీఓ కార్యక్రమాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వన్నెతెచ్చేలా అర్జీల స్వీకరణ కార్యక్రమం ప్రజలకు మరింత చేరువ కానుంది. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. మండలాలు, మున్సిపాలిటీల స్థాయిల్లో ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టారు. దీని ద్వారా ప్రజలు స్థానికంగా జిల్లా అధికారులకు వారి సమస్యలను తెలియజేయవచ్చు. సత్వర పరిష్కారం పొందవచ్చు.

కలెక్టర్‌తో సహా..

జగనన్నకు చెబుదాం ప్రత్యేక కార్యక్రమానికి కలెక్టర్‌తో సహా జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో మండలాలకు చేరుకుని ప్రజల వినతులు స్వీకరిస్తారు. దీనిద్వారా ప్రజలకు కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ కార్యక్రమం నిర్వహణకు తహసీల్దార్లు, ఎంపీడీఓలకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమం నిర్వహించే తేదీని ఆయా గ్రామాల్లో ముందుగానే విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు.

ఈనెల 8న ప్రారంభం

జిల్లాలో ఈనెల 8న మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని యలమంచిలిలో ప్రారంభించారు. తొలి కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. 103 మంది తమ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఎన్నడూలేని విధంగా జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



యలమంచిలిలో జరిగిన కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

జిల్లాలో షెడ్యూల్ ఇలా..

జిల్లాలో మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈనెల 8న ప్రారంభించగా నవంబర్ 15వ తేదీ మండల, మున్సిపాలిటీ స్థాయిలో నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. మండల స్థాయిలో ఎంపీడీఓ కార్యాలయాల్లో, మున్సిపాలిటీ స్థాయిలో మున్సిపల్ కార్యాలయాలో అదే రోజు ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తారు.

మరో మంచి వేదిక



ప్రజాసమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం మరో చక్కటి వేదిక. జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిల్లో పరిష్కరించాల్సిన సమస్యలను బాధితులు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం ఉపయోగపడుతుంది. దీని ద్వారా అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. అర్జీదారులు సంతృప్తి చెందేవరకు దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుంది. ఈ కార్యక్రమంలో వినతుల పరిష్కారంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు.

– దాసి రాజు, ఆర్డీఓ, భీమవరం

జగనన్నకు చెబుదాం షెడ్యూల్

మండలం	నిర్వహణ తేదీ
ఉండి	సెప్టెంబర్ 13
వీరవాసరం	సెప్టెంబర్ 15
భీమవరం రూరల్, అర్బన్	సెప్టెంబర్ 20
మొగల్తూరు	సెప్టెంబర్ 22
పాలకోడేరు	సెప్టెంబర్ 27
నరసాపురం రూరల్, అర్బన్	సెప్టెంబర్ 29
కాళ్ల	అక్టోబర్ 04
పాలకొల్లు రూరల్, అర్బన్	అక్టోబర్ 06
పెంటపాడు	అక్టోబర్ 11
పోడూరు	అక్టోబర్ 13
తాడేపల్లిగూడెం రూరల్, అర్బన్	అక్టోబర్ 18
పెనుమంట్ర	అక్టోబర్ 20
గణపవరం	అక్టోబర్ 25
పెనుగొండ	అక్టోబర్ 27
ఆకివీడు రూరల్, అర్బన్	నవంబర్ 01
ఆచంట	నవంబర్ 03
అత్తిలి	నవంబర్ 08
తణుకు రూరల్, అర్బన్	నవంబర్ 10
ఇరగవరం	నవంబర్ 15

జిల్లాలో పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ రవిప్రకాష్



సాక్షి, భీమవరం: చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా భీమవరంతోపాటు జిల్లాలోని ఇతర పట్టణాలు, అన్ని ముఖ్య కూడళ్లలో బందోబస్తు, ప్రధాన రహదారుల్లో పెట్రోలింగ్ వాహనాల ద్వారా భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. చెక్‌పోస్టులు పెట్టి, భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు. నిరసనలను శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నియమిత ప్రదేశాల్లో చేపట్టాలన్నారు. ప్రజానీకానికి ఏ విధమైన అడ్డంకులు, అవరోధాలు కలగకుండా శాంతియుతంగా చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు.

కారుణ్యానికి ప్రాధాన్యం

- కారుణ్య నియామకాలకు ప్రభుత్వం చర్యలు
- చురుగ్గా ఉద్యోగాల కల్పన
- ఉద్యోగి కుటుంబాలను ఆదుకోవడమే ధ్యేయం
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో పలువురికి నియామక పత్రాలు

ఏలూరు(మెట్రో): ఓ వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి తీరని శోకం.. అదే ఆ కుటుంబానికి ఆధారంగా నిలిచే ఉద్యోగి మరణిస్తే వారి వేదన వర్ణనాతీతం.. కుటుంబాన్ని పోషించే ఆధారం కోల్పోయిందనే బాధ వారిని మరింతగా కుంగదీస్తోంది. అటువంటి వారి బాధలు తీర్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారుణ్య నియామకాలకు చర్యలు తీర్చుకున్నారు. ఉద్యోగి కుటుంబానికి అండగా నిలిచేలా అర్హులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పలువురికి ఉద్యోగాలు కల్పించారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కారుణ్య నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.



ఏలూరులో కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ (ఫైల్)

48 మండలాల పరిధిలో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 48 మండలాలు పరిధిలో జిల్లాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కార్యాలయాల్లో పనిచేస్తూ విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఉద్యోగి మరణించిన వెంటనే ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా అందిస్తోంది. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గతంలో ఎన్నడూ లేనివిధంగా కారుణ నియామక పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. కుటుంబానికి ఆర్థిక దన్నుగా నిలిచిన వ్యక్తి మరణించిన లోటును భర్తీ చేయలేకపోయినా ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ఉపక్రమించారు. ఉద్యోగి కుటుంబంలో అర్హులైన వ్యక్తులకు ఉద్యోగ భద్రత కల్పిస్తున్నారు. బాధిత కుటుంబం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే అవసరమైన పత్రాలను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫైళ్లకు సైతం మోక్షం కల్పిస్తున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా పద్మశ్రీ బాధ్యతలు స్వీకరించిన మూడు నెలల కాలంలో ఇప్పటివరకు వివిధ కేటగిరీల్లో 32 మందికి ఉద్యోగాలు కల్పించారు. అలాగే 39 మంది జిల్లాపరిషత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కారుణ్య నియామకాలు, పదోన్నతులు కల్పించడంపై అభ్యర్థులు, ఉద్యోగులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

3 నెలల కాలంలో కారుణ్య నియామకాలు

జూనియర్ అసిస్టెంట్లు	17
టైపిస్టులు	8
ఆఫీస్ సబార్డినేట్లు	5
క్లాస్–4 ఉద్యోగులు	2
మొత్తం	32

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



కన్నాపురంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కొయ్యలగూడెం: అక్రమంగా నిల్వ చేసి ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు ఆదివారం పేర్కొన్నారు. కన్నాపురంలో గ్రంధి శ్రీనివాసరావు ఇంటి వద్ద 1.5 టన్నుల రేషన్ బియ్యం అక్రమ నిల్వలను గుర్తించినట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు సంయుక్తంగా తనిఖీ నిర్వహించి గ్రంధి శ్రీనివాసరావుపై 6(ఎ), 7(1) కేసులు నమోదు చేశారు. మొత్తం సరుకు విలువ రూ.32,000 ఉంటుందని అధికారులు తెలిపారు. విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ, ఎన్.బాపిరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పెనుగొండ: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పెనుగొండ ఎస్సై రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దొంగరావిపాలెం వద్ద ఈ నెల 7వ తేదీ రాత్రి 60 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వృద్ధురాలు సిమెంట్ రంగు చీర, నీలం రంగు జాకెట్టు ధరించి ఉందని, అదేవిధంగా చేతిపై గుర్తు తెలియని భాషలో పచ్చబొట్టు ఉందన్నారు. వృద్ధురాలి వివరాలు తెలిసిన వారు పెనుగొండ సీఐ లేదా పెనుగొండ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఏపూరులో బలన్మరణానికి పాల్పడి..

పెదపాడు: ఏపూరులో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఏపూరులోని చెంచుల కాలనీకి చెందిన దేవరబోయిన ఏసు (35) చేపలు పట్టే పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల నరాల బలహీనతకు గురై మద్యానికి బానిసయ్యాడు. రోజు మాదిరిగానే ఈనెల 7న పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో తాటిదూలానికి ప్లాస్టిక్ వైరుతో ఉరి వేసుకున్నాడు. భార్య గమనించి కేకలు వేయగా అన్నదమ్ములు అతనిని హనుమాన్ జంక్షన్‌లో ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ బోర్డులో బీసీలకు పెద్దపీట

- నలుగురు బీసీలకు స్థానం కల్పించడంపై హర్షం
- గతంలో లేనివిధంగా బీసీలకు అధిక ప్రాధాన్యం
- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ సంఘాల నేతలు



సమావేశంలో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో నలుగురు బీసీలకు స్థానం కల్పించడంపై బీసీ సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదని బ్యాక్ బోన్ అని మరోసారి రుజువు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు బీసీ సంఘాల నేతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో ఎన్నడూ లేనివిధంగా బీసీలు నలుగురికి స్థానం కల్పించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీల పక్షపాతిగా నిరూపించుకున్నారంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాయీబ్రాహ్మణ వర్గానికి చెందిన సిద్ధవటం యానాదయ్య, అగ్నికుల క్షత్రియ వర్గానికి చెందిన పొన్నాడ సతీష్, యాదవ సామాజికవర్గానికి చెందిన నెరుసు నాగసత్యం యాదవ్, గౌడ సామాజిక వర్గానికి చెందిన మేకా శేషుబాబులకు స్థానం కల్పించడం గొప్ప విషయమన్నారు. ఇందులో ఏలూరుకు చెందిన నెరుసు నాగసత్యం, పాలకొల్లుకు చెందిన మేకా శేషుబాబు ఉండటం మరింత సంతోషంగా ఉందంటూ బీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు. కేవలం మాటలతో కాకుండా చేతలతో చేసి చూపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలోని బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారంతా ఎంతో రుణపడి ఉంటారని చెబుతున్నారు.

గత పాలకులకు భిన్నంగా..

కేవలం మాటలతో సరిపెట్టిన గత పాలకులకు భిన్నంగా ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని బీసీలకు పెద్దపీట వేస్తున్నారంటూ బీసీ సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బీసీలు తమ పార్టీకి వెన్నుముక అని చెప్పిన టీడీపీ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుని వదిలేసిందని గుర్తు చేస్తున్నారు. దీనికి భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కేవలం మాటలు చెప్పకుండా చేతల్లో బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే ఉంటారని ఘంటాపథంగా చెబుతున్నారు.

బీసీలకు సముచిత స్థానం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అన్ని రంగాల్లోనూ బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారు. మాటలతో కాకుండా చేతల్లో చేసి చూపుతూ రాష్ట్రంలోని బీసీల ఆదరాభిమానాలు చూరగొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా సీఎం వైఎస్ జగన్ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారు.

– లక్కోజు రాజగోపాలాచారి, అధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఏలూరు అర్బన్

నాయీబ్రాహ్మణులకు గుర్తింపు



తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు నివ్వడం మర్చిపోలేం. రాష్ట్ర అధ్యక్షులు సిద్ధవటం యానాదయ్యకు బోర్డు సభ్యునిగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న నాయీబ్రాహ్మణ సమస్యలను పరిష్కరించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్. రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులు అందరూ ఆయనకు ఎంతో రుణపడి ఉంటాం.

– కింజంగి రాజు, రాష్ట్ర కార్యదర్శి, ఏపీ బీసీ చైతన్య సమితి, జిల్లా ప్రధాన కార్యదర్శి, నాయీబ్రాహ్మణ సంఘం, ఏలూరు

బీసీలను ఆదరించిన ఏకైక సీఎం



రాష్ట్రంలో బీసీలను ఆదరించిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. వెనుకబడిన కులాలుగా ఉన్న మాకు రాజకీయంగా, నామినేటెడ్ పదవులలలో అవకాశం కల్పించి ప్రోత్సహిస్తున్నారు. ఇదే క్రమంలో గత పాలకులు ఎవ్వరూ ఇవ్వని విధంగా టీటీడీ బోర్డు పాలకమండలిలో నలుగురికి స్థానం కల్పించడం పట్ల వడ్డెర సంక్షేమ సంఘం, బీసీ సంక్షేమ సంఘం తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– ఘంటసాల వెంకటరమణ, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, ఏలూరు

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలోని బీసీలకు అన్నింటా పెద్దపీట వేస్తున్నారు. ఇటు రాజ్యసభ నుంచి అటు అసెంబ్లీ, శాసనమండలి, జిల్లా పరిషత్ చైర్మన్ పదవులు, నామినేటెడ్ పదవుల్లో ఎన్నడూ లేని గుర్తింపు లభించింది. తాజాగా టీటీడీ పాలక మండలిలో ఏకంగా నలుగురు బీసీలకు స్థానం కల్పించడం ద్వారా తగిన గుర్తింపు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది.

– బాయి వెంకటరావు, జిల్లా అధ్యక్షులు, నాగవంశీ సంఘం, ఏలూరు

లోక్ అదాలత్‌లో 9,901 కేసుల పరిష్కారం



సి.పురుషోత్తం కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఏలూరు (టూటౌన్): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 9,901 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఏలూరులో 8, భీమవరంలో 5, కొవ్వూరులో 4, నరసాపురంలో 3, తణుకులో 4, తాడేపల్లిగూడెంలో 3, పాలకొల్లు, నిడదవోలు, చింతలపూడి, భీమడోలులో ఒకొక్కటి చొప్పున, జంగారెడ్డిగూడెంలో 2 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. లోక్ అదాలత్‌లో మొత్తం 9,901 కేసులు పరిష్కారం కాగా, వీటిలో 9,485 క్రిమినల్, 65 మోటారు ప్రమాద బీమా, 183 సివిల్ కేసులను రాజీ చేయగా 168 ప్రిలిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. అలాగే కోర్టుల వారీగా ఏలూరులో 1,876, భీమవరంలో 971, చింతలపూడిలో 513, జంగారెడ్డిగూడెంలో 887, కొవ్వూరులో 867, నరసాపురంలో 760, పాలకొల్లులో 601, తాడేపల్లిగూడెంలో 940, తణుకులో 1,077, నిడదవోలులో 960, భీమడోలులో 449 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కేసుల పరిష్కారానికి సహకరించిన న్యాయవాదులు, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులకు, ఛిట్ ఫండ్ ప్రతినిధులు, కార్మిక శాఖ, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్, అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్, కార్యదర్శి జి.రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.

స్కిల్ స్కామ్‌లో నిందితులందరినీ అరెస్ట్ చేయాలి



తణుకు సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తణుకు టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్‌లో నిందితులుగా ఉన్న వారందరినీ వెంటనే అరెస్ట్ చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు హౌసింగ్ బోర్డులో కాలనీలో జరిగిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేయడంతో రాష్ట్రంలోని కొన్ని మీడియా సంస్థలు, పవన్ కల్యాణ్, నారాయణ, తులసిరెడ్డిలు ఎందుకు గుండెలు బాదుకుంటున్నారో అర్థం కావడంలేదన్నారు. అవినీతికి పాల్పడిన బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ అరెస్ట్ అయి జైలు జీవితం గడిపారని, అదే విధంగా చంద్రబాబు కూడా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. స్కిల్ స్కామ్ రిపోర్టులో నారా లోకేష్ పేరు కూడా ఉందని, లోకేష్‌తో పాటు ఈ కేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని కోరారు. చట్టం ముందు అందరూ సమానులేనని, గతంలో ఓటుకు నోటు కేసులో చంద్రబాబు నాయుడు తప్పించుకున్నారని, ఆయన 130 కేసుల్లో స్టే తెచ్చుకున్నారని చెప్పారు. గతంలో బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ మాదిరిగానే చంద్రబాబు నాయుడు కూడా తన శేష జీవితాన్ని జైలులో గడుపుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు యూత్ అధ్యక్షుడు అద్దంకి ఆనంద్, బిరడా సందీప్, బీరా సునీల్, మరపట్ల యేసేబు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ మిషన్ స్కీమ్‌లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా వైద్యారోగ్యశాఖ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో భాగంగా వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి.మహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్ (కాంట్రాక్ట్ బేసిస్)–11, స్టాఫ్ నర్స్ (కాంట్రాక్ట్ బేసిస్)– 25, ఫార్మసిస్ట్ (కాంట్రాక్ట్)–10, ల్యాబ్ టెక్నీషియన్(కాంట్రాక్ట్ బేసిస్)–4, డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఔట్ సోర్సింగ్)–6, నాలుగో తరగతి ఉద్యోగి/లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (ఔట్ సోర్సింగ్)–12 కలిపి మొత్తము 68 వివిధ పోస్టుల ఖాళీలు ఉన్నాయన్నారు. వెబ్‌సైట్‌లో పొందుపరచిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, సర్టిఫికెట్ల ఒక జిరాక్స్ సెట్‌ను ఏలూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా అందజేయాలని సూచించారు.

మొయ్యేరు ఆర్‌బీకే తనిఖీ

గణపవరం: రైతులు తమ పంట వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని జేడీఏ జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. మొయ్యేరు రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈకేవైసీ జరుగుతున్న తీరు పరిశీలించారు. ఎంత శాతం ఈకేవైసీ పూర్తయిందని సిబ్బందిని ప్రశ్నించారు. పంట వివరాలు నమోదు కాని రైతులు వెంటనే ఆర్‌బీకేలలో సంప్రదించాలన్నారు. పంట నమోదుతో ప్రభుత్వం అందించే పథకాలు, పంట నష్టపరిహారం వంటివి సులభంగా అందుతాయన్నారు. ఏవో యర్రంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఈకేవైసీ 84 శాతం పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఏవోలు, వీఏఏలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: కోరుమిల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



యలమంచిలి: దొడ్డిపట్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

శ్రీవారి ట్రస్టుబోర్డులో మరో ముగ్గురి నియామకం



తొమ్మండ్రు రమేష్



తాతా శ్రీనివాసరావు



కె.వెంకటేశ్వరరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం పాలకవర్గం (ట్రస్ట్‌బోర్డ్)లోకి ప్రత్యేక ఆహ్వానితులుగా ముగ్గురిని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల్ వలవెన్ ఈనెల 7న జీఓను జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంకు చెందిన తొమ్మండ్రు రమేష్, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన తాతా శ్రీనివాసరావు, కొట్టు వెంకటేశ్వరరావులను నియమించారు. దీంతో ప్రస్తుతం 15 మంది సభ్యులుగా ఉన్న పాలకవర్గం, ఈ ముగ్గురి నియామకంతో ఆ సంఖ్య 18కి చేరింది. కొత్తగా నియమితులైన వీరు త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

బాస్కెట్‌బాల్ బాలికల జిల్లా జట్టు ఎంపిక



జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికైన బాలికలు

ఏలూరు రూరల్: మార్టేరులో నిర్వహించే అంతర రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టును ఎంపిక చేసినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ కోశాధికారి కె మురళీకృష్ణ, హెచ్ఎం జి.సునీత, పీఈటీ ఎంవీఎల్ ప్రసన్న పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది బాలికల్లో ప్రతిభ చాటిన వారిని జట్టుకు ఎంపిక చేశామన్నారు. జట్టుకు ఎంపికైన వారిలో బి.లీలావతి, బి.భవానీదేవి, ఏటీ అనిత, జి.నాగదేవి, ఆర్.మహిత, టి.జ్యోతి, ఎల్.లీలాసరోజిని, పి.నాగవినయశ్రీ, పీఎల్ ప్రవల్లిక, జి.పూజిత, రుతిక, వి.నిఖిల ఉన్నారు. స్టాండ్‌బై క్రీడాకారులుగా జి.సాయిసుధ, డి.పావని ప్రియ, ఎ.పూర్ణచంద్రిక ఉన్నారని వెల్లడించారు.

వ్యాన్ ఢీకొని కూలీ మృతి



నాగరాజు మృతదేహం

మండవల్లి: బైక్‌పై వెళుతుండగా, వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెనుమాకలంక గ్రామానికి చెందిన జయమంగళ నాగరాజు (25) కూలీ పనులకు వెళుతుంటాడు. ఆదివారం బైక్‌పై వ్యక్తిగత పనులపై వెళుతుండగా చావలిపాడు సీఎస్ఆర్ గార్డెన్స్ వద్ద ఎదురుగా వస్తున్న ఇతనిని వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజుకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులకు, పెనుమాకలంక గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చట్టం ముందు అందరూ సమానులే

ఏలూరు (టూటౌన్): ఏసీబీ కోర్టు చంద్రబాబుకు రెండు వారాల పాటు రిమాండ్ విధించడంపై చట్టం ఎవరి చుట్టం కాదని రుజువైందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఏలూరు నాయకులు పితాని దుర్గాప్రసాద్, చదలవాడ వెంకటరమణ, సీపీపీఎస్ ఆచార్యులు మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని మరోసారి రుజువైందన్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేశారన్న ఆరోపణలను నాయకులు ఖండించారు. ముఖ్యమంత్రి హోదాను అడ్డుపెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడి రూ.371 కోట్ల ప్రభుత్వ సొమ్మును భోగస్ షెల్ కంపెనీలకు మళ్లించి అక్రమాలకు పాల్పడటమే కాక సాక్ష్యాధారాలు మాయానికి పాల్పడినట్లుగా నిర్ధారించుకున్న తర్వాతే సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్ట్ చేసి విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపర్చారని తెలిపారు. సీఐడీ తరుపున వాదనలు వినిపించిన పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సేంద్రియ సేద్యంతో పుష్టిగా పోషకాలు

- మితిమీరి ఎరువుల వినియోగంతో అనర్థాలు
- పోషకాల లేమితో లోపిస్తున్న సమతుల్యత
- పంట నాణ్యత, దిగుబడిపైనా తీవ్ర ప్రభావం



మెట్ట ప్రాంతంలో సాగు చేస్తున్న వేరుశనగ పంట

పాడి - పంట

చింతలపూడి: తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటను పండించడానికి విచక్షణారహితంగా రసాయన ఎరువులను నేడు రైతులు వినియోగిస్తుండటంతో భూముల్లో పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపిస్తోంది. ముందెన్నడూ లేని విధంగా ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటల్లో కనిపిస్తున్నాయి. ఈ పోషకాలు లోపించినప్పుడు సాగులో మిగతా యాజమాన్య పద్ధతులన్నీ సక్రమంగా పాటించకపోయినా దిగుబడులు తగ్గుతాయి. పంట నాణ్యత కూడా తగ్గే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పంటలలో సూక్ష్మ పోషక లోపాలు కనిపించినప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ లోపాలను అధిగమించడానికి రైతు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఎంచుకుంటే మేలని వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్ సూచిస్తున్నారు.

ఎరువుగా జిప్సం

జిప్సం రసాయన నామం. జిప్సంలో 24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉంటుంది. కాల్షియం, గంధకం మొక్కల పెరుగుదలకు అవసరమైన ద్వితీయ శ్రేణి పోషకాలను అత్యంత చౌకగా జిప్సం ద్వారా అందించవచ్చు. ముఖ్యంగా నూనె గింజలు, పప్పుధాన్యాల వంటి పంటల్లో గంధకం అధికంగా ఉంటుంది. కాల్షియం మొక్కల్లోని జీవకణాల అంచులు గట్టిగా ఉండటానికి, కణ విభజనకు, వేర్ల అభివృద్ధికి గింజ కట్టడానికి అవసరమవుతుంది. దీని వల్ల మొక్కలకు చీడపీడలను ఎదుర్కొనే శక్తి సమకూరుతుంది.

వేరుశనగ పంటలో..

వేరుశనగ పంటలో జిప్సంను పూత దశలో వేసుకుని భూముల్లో కలియబెట్టడం వల్ల మొక్కల ఊడలు జిప్సంలోని కాల్షియం, గంధకాన్ని తీసుకుని అధిక దిగుబడులనిస్తాయి. వేరుశనగలో జిప్సం వినియోగం వల్ల కాయలు గట్టిగా ఉండి కాయ నిండా పప్పు వృద్ధి చెంది గింజల్లో అధిక నూనె శాతం కలిగి ఉంటుంది. ఫలితంగా కాయలు అధిక బరువు కలిగి మంచి ధర పలుకుతాయి. కాబట్టి పూత సమయంలో ఎకరాకు 200 కిలోల చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా వేసుకోవాలి. బీడు, చౌడు భూముల్లో నీరు సరిగా ఇంకదు. గాలి ప్రసరణ తక్కువగా ఉంటుంది. భూమి భౌతిక లక్షణాలు క్షీణించి ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మొక్కల వేర్లు సరిగా వృద్ధి చెందక మొక్కల్లో ఎదుగుదల ఉండదు. ఇలాంటి భూముల్లో జిప్సం వినియోగం వల్ల నేల గుల్లబారి భూమిలో నీరు ఇంకే స్వభావం పెరిగి మొక్కల వేర్లు బాగా వృద్ధి చెందుతాయి. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.



బి.నాగకుమార్, ఏడీఏ వ్యవసాయ సబ్‌డివిజన్

ఆదర్శ గ్రామం చినతాడే'పల్లె'లో సంక్షేమ రాజ్యం

- గత నాలుగేళ్లలో రూ.11.18కోట్ల సంక్షేమ పథకాల లబ్ధి
- గడప గడపకు, నాడు–నేడు, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు అదనం
- దాదాపు రూ.13కోట్లకు పైగా లబ్ధి



చినతాడేపల్లి గ్రామంలో నూతన హంగులతో నిర్మించిన సచివాలయం భవనం



చినతాడేపల్లి గ్రామం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల ఆర్థిక పురోభివృద్ధి సాధించే దిశగా రాష్ట్రంలోనీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. 2019 జూన్‌లో అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు వివిధ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తూ వచ్చింది. అర్హత ప్రామాణికంగా సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. గత నాలుగేళ్ల కాలంలో తాడేపల్లిగూడెం మండలంలోని చినతాడేపల్లి ఒక్క గ్రామానికే 11 కోట్ల 18లక్షల 85వేల 291 రూపాయలు లబ్ధి చేకూరిందంటే సంక్షేమ పథకాలు ఏ రీతిగా అమలవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆ వివరాల్లోకెళితే – అమ్మ ఒడికి 650మంది లబ్ధిదారులకు గాను రూ.60.11లక్షలు, జగనన్న వసతి దీవెనకు 193మంది లబ్ధిదారులకు రూ.18.74లక్షలు, జగనన్న విద్యాదీవెన 138మందికి గాను 21లక్షల 77వేల 721 రూపాయలు, వైఎస్సార్ రైతు భరోసాలో 754మందికి 98.02లక్షలు, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు 257మందికి రూ.23.32లక్షలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమాలో 246మందికి రూ.16.36లక్షలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీకి 103మందికి 9.53లక్షలు, వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ) లో 1706మందికి 85.59లక్షలు, వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 1257మందికి రూ.3,82,23,000లు, వైఎస్సార్ చేయూతలో 402మందికి రూ.75.37లక్షలు, వైఎస్సార్ ఆసరాలో 1182మందికి రూ.1,79,78,568లు, వైఎస్సార్‌బీమా కింద రూ.15లక్షలు, వైఎస్సార్ కాపు నేస్తం రూ.1,05లక్షలు, జగనన్న చేదోడు కింద 72మందికి రూ.7.20లక్షలు, వైఎస్సార్ వాహన మిత్ర కింద 44మందికి రూ.4.40లక్షలు, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద 15మందికి రూ.85,202లు, అగ్రిగోల్డ్‌లో తొమ్మిది మందికి రూ.1.10లక్షలు, అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు తొమ్మిది మందికి రూ.45వేలు, వైట్ కార్డ్ హోల్డర్లకు ప్రత్యేక కోవిడ్ సాయం ఇరువురికి రూ.లక్ష, వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద 53మందికి రూ.7.95లక్షలు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ 60మందికి రూ.21.21లక్షలు, వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా కింద రూ.1.50లక్షలు, హౌసింగ్ లబ్ధిదారులు 39మందికి 66.30లక్షలు వెరసి 11 కోట్ల 18లక్షల 85వేల 291 రూపాయలు లబ్ధి చేకూరింది. ఇవి కాకుండా, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మరో రూ.20లక్షలు రోడ్లు, డ్రెయిన్లకు కేటాయించారు. అదే విధంగా సచివాలయం, ఆర్‌బీకే, గోదాము, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లకు మరో రూ.87.30లక్షలు, నాడు–నేడులో మొదటి దశలో రూ.20,87,818లు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25లక్షలు వెచ్చించారు.

విద్యకు తోడ్పాటునిచ్చిన జగనన్న



నాపేరు పద్మ. నేను చినతాడేపల్లి గ్రామంలో నివసిస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. సంతోష్‌కుమార్ ఇంటర్మీడియట్‌తో చదువు మానేశాడు. కుమార్తె భాగ్యలక్ష్మి తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో చదువుతుంది. వారి విద్యాభ్యాసానికి అమ్మ ఒడి పథకం ద్వారా కుమార్తె చదువుకు సీఎం జగనన్న ఎంతగానో తోడ్పాటునందించారు. జగనన్న రుణం తీర్చుకోలేం.

– పద్మ, చినతాడేపల్లి గ్రామస్తురాలు, తాడేపల్లిగూడెం మండలం

ప్రజలకు సేవ చేయడం గర్వంగా ఉంది



వలంటీర్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని సచివాలయంలో ఉండే కంప్యూటరీకరించడం జరుగుతుంది. ఆ సమాచారం ఆధారంగా ప్రజల అర్హతల ఆధారంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుంది. సీఎం పాలనలో తాము పనిచేయడం వల్ల ప్రజల ఆశీస్సులు లభిస్తున్నాయి.

– బిరుదుకోట రమేష్, పంచాయతీ కార్యదర్శి, చినతాడేపల్లి, తాడేపల్లిగూడెం మండలం

గతంలో ఏనాడూ ఇంత అభివృద్ధి జరగలేదు



గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. ఏనాడూ గ్రామాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరిట గ్రామ పారిశుద్ధ్యాన్ని అస్తవ్యస్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడింది. ఏనాడూ ఇంత అభివృద్ధి జరిగిన పాపానపోలేదు.

– పిచ్చికల రాజారావు, సర్పంచ్, చినతాడేపల్లి, తాడేపల్లిగూడెం మండలం

మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావుకు సతీ వియోగం

తణుకు టౌన్: తణుకు మాజీ శాసన సభ్యుడు ముళ్లపూడి వెంకట కృష్ణారావు సతీమణి ముళ్లపూడి లక్ష్మి (73) ఆదివారం ఉదయం అకస్మికంగా మృతి చెందారు. ఆమెకు భర్త ముళ్లపూడి వెంకట కృష్ణారావు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మి మృతి పట్ల రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకట కృష్ణారావుకు ఫోన్‌చేసి పరామర్శించారు. ఆమె కుటుంబ సభ్యులకు మంత్రి కారుమూరి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు సతీమణి లక్ష్మి మృతి పట్ల గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీటీసీ సభ్యురాలు కామన కృష్ణవేణి, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు దొమ్మేటి వెంకట సుదాకర్, పరిమి వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు లక్ష్మి భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

15మంది వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం సంచార వైద్యశాల ద్వారా అందించే ఉచిత వైద్యసేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 15 మంది ఇంటి నుంచి నడవలేని వారికి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సంచార వైద్యశాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్రలు తణుకు పట్టణం, పరిసర ప్రాంతాలకు చెందిన 15 మంది ఇంటి నుంచి నడవలేని వారికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యురాలు ఆలపాటి మాధవి ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు గిరిజాల సత్యనారాయణ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- చంద్రబాబు విచ్చలవిడి దోపిడీ వాస్తవం
- కోరిమిల్లి, చింతపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం



పెంటపాడు మండలం కోరిమిల్లి గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోరిమిల్లి, చింతపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రతి వ్యక్తికి ప్రభుత్వ పథకాలు సరిగా అందుతున్నాయా అని ఆరా తీసారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో టీడీపీ అధినేత చంద్రబాబు అధికారం అడ్డుపెట్టుకొని భారీ కుంబకోణంకు పాల్పడటం, దీనిపై ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం సమంజసమే అన్నారు. ఈ విషయంలో వైఎస్సార్ ప్రభుత్వానికి ఏ సంబంధం లేదన్నారు. చట్టం తన పని తాను చేసుకు పోతుందన్న రీతిగా చంద్రబాబు అరెస్టు, విచారణ, రిమాండ్ జరిగిందన్నారు. ఆయన విచ్చలవిడి దోపిడీ సమంజసమే అని దీనిని బట్టి తెలుస్తోందన్నారు. అమరావతి పేరున భారీ కుంభకోణం జరిగిందన్నారు. ఇంకా మరిన్ని కుంబకోణాలు బయటపడే అవకాశం ఉందన్నారు. చంద్రబాబు అరెస్టు వెనుక ప్రభుత్వ తొందరపాటు, ప్రతీకారం, కక్ష్య వంటివి లేవన్నారు. రెండు గ్రామాల్లో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ప్రజల వినతులను మంత్రి స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. చింతపల్లి గ్రామంలో పార్టీ నాయకులు కిరణ్ కుమార్ రాజు, రామలింగరాజు ఆధ్వర్యంలో భారీ బాణసంచా కాల్చారు. ఉపముఖ్యమంత్రిగా విచ్చేసిన మంత్రి కొట్టు సత్యనారాయణను గ్రామస్తులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వల్లూరి బ్రహ్మనందం, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ముప్పిడి సరోజిని, పాలా గణపతి, దేవరశెట్టి రాంబాబు, చుండూరి సర్వేశ్వరరావు, పేరిచర్ల కిరణ్‌కుమార్‌రాజు, దాట్ల రామలింగరాజు, వేములమంద జానకిరామరాజు, చల్లా కుమారస్వామి, సొసైటీల అధ్యక్షుడు దేవ వెంకటరమణ, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, అడ్వకేట్ హరిదాసు రవీంద్ర, కేంద్ర కమిటీ సభ్యులు ముప్పిడి సంపత్‌కుమార్, రావిపాడు గ్రామ నాయకులు ములగాల బాబ్జి, వింజమూరి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, దేవరశెట్టి సత్యనారాయణ, చల్లా లింగమూర్తి, చిలకా నాగరాజు, ముప్పిడి సుబ్బారావు, వద్రే రామకృష్ణ, రైతు నాయకులు మద్రే కృష్ణమూర్తి, నల్లమిల్లి గాందీరెడ్డి, విజయానందరెడ్డి, కొవ్వూరి భాస్కరరెడ్డి,పలు గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు విషయంలో ధర్మం గెలిచింది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఆకివీడు: చంద్రబాబు విషయంలో ధర్మం గెలిచిందని, తప్పు చేస్తే శిక్ష తప్పదని, ఎంతటివారికైనా చట్టం ఒక్కటేనని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ అరెస్టు, రిమాండ్, రాజమండ్రి జైలుకు తరలించడంపై ఆదివారం స్థానిక త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించి, ప్రతిపక్ష నేతగా చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు హుందాగా ప్రవర్తించాలన్నారు. సీఐడీ చేసిన ఆరోపణలు వాస్తవం కాదని కోర్టులో నిరూపించుకోవాలే తప్ప, ఆరోపణలపై ఆగ్రహావేశాలు ప్రదర్శించడం అవివేకమన్నారు. సీఐడీ వద్ద కచ్చితమైన ఆరోపణలున్నందునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేయడం, రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. చట్టప్రకరం 14 రోజులు రిమాండ్ విధించడం, రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపడం అన్నీ చట్టప్రకారమే జరిగాయని చెప్పారు. కోర్టు విధించిన రిమాండ్‌కు బద్ధులై టీడీపీ నాయకులు సామాన్య జీవనానికి అడ్డు రావదన్ని చెప్పారు. విధ్వంసాలు సృష్టించవద్దన్నారు. రాజకీయం అంటే స్వచ్ఛతగా ఉండాలని, శాంతి భద్రతలకు భంగం కల్గనివ్వద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆధారాలున్నప్పుడు అరెస్టు చేయడం తప్పుకాదన్నారు. ఆంధ్రప్రదేశ్ క్లీన్‌గా ఉందని ఇక్కడ రాజకీయ నాయకులు, కోర్టు కూడా స్వచ్ఛంగా ఉన్నాయని ఆయన చెప్పారు. సమావేశంలో త్రిసభ్యకమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, కౌన్సిలర్లు నిమ్మల నాగు, ఎండీ. జక్కీ, నాయకులు ఎండీ.ఆలీ, కేశిరెడ్డి దుర్గారావు, అందే రాజబాబు, కేశిరెడ్డి దిలీప్, రాజనాల పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞాలతోనే లోక శాంతి



శ్రీ లక్ష్మీ నారాయణస్వామి యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు

భీమవరం (ప్రకాశంచౌక్): పురుణాల సమయం నుంచి రుషులు లోక శాంతి, లోక కల్యాణార్థం యజ్ఞాలు నిర్వహించే వారని, ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాలు, అనారోగ్య పరిస్థితులు పోవాలంటే యజ్ఞాలే శరణ్యమని భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం బిల్డర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్– ప్రమీలాదేవి దంపతులు ఆదివారం సుదర్శన లక్ష్మీనారాయణ స్వామి యజ్ఞం వైభవంగా గన్నాబత్తుల వారి వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి వ్రతం 108 సార్లు, నెలకు ఒకసారి నిర్వహించి 108వ వ్రతాన్ని, దానితో పాటు సుదర్శన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి యజ్ఞం ఘనంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమ పర్యవేక్షకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ క్రతువుతోపాటు , చిన్నఅమిరం వృద్ధాశ్రమంలో వంద మందికి భోజనాలు, భీమవరం పట్టణంలోని అన్ని దేవాలయాల అర్చకులకు నూతన వస్త్రాలు, గన్నాబత్తుల వారి కుటుంబంలో దశాబ్దాల కాలంగా పని చేస్తున్న కార్మికులను కూడా నూతన వస్త్రాలతో సత్కరించి అన్న ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నర్సాపురం వైస్ కళాశాల కార్యదర్శి డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, గన్నాబత్తుల రామారావు , టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, ఉద్దరాజు రాఘవ రాజు, పాకా వెంకట సత్యనారాయణ, చినిమిల్లి వెంకటరాయుడు, గూడూరి ఉమాబాల , టీవీవీ ప్రసాద్, పుప్పాల శేషు , నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి మందుబాబు హల్‌చల్

సాక్షి, భీమవరం: పట్టణంలోని బుధవారం మార్కెట్ కూడలిలో ఉన్న సెల్ టవర్‌ను ఆదివారం ఓ మందుబాబు ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సెల్ టవర్ ఎక్కిన వ్యక్తిని కిందకు తీసుకువచ్చారు. టవర్ ఎక్కే సమయంలో చేతికి గాయం కావడంతో అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి పట్టణానికి చెందిన బి.వసంతరావు అని, వివరాలు సేకరిస్తున్నామని సీఐ అడబాల శ్రీను తెలిపారు. ఇదిలా ఉండగా, మద్యం మత్తులో గతంలో అనేకసార్లు వసంతరావు సెల్ టవర్ ఎక్కాడని, దీనికి ప్రత్యేక కారణం ఏమీ లేదన్నారు.

తూర్పుతాళ్లులో అన్నసమారాధన

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్ల పరిధిలోని పెదతోటలో కొలువై ఉన్న శ్రీ కృష్ణుని ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల వంటకాలతో చేసిన పసందైన భోజనాన్ని భక్తులకు వడ్డించారు.

బడుగులు రాజ్యాధికారం సాధించాలి



పెనుమదంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

పోడూరు: బడుగు, బహుజన వర్గాలు రాజ్యాధికారం దిశగా పయనించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని పిలుపునిచ్చారు. పెనుమదంలో ఆదివారం మండలస్థాయిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. నియోజకవర్గ అధ్యక్షుడు పితాని చిన్న సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముద్దాడ గణేష్‌భవాని మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా బడుగు, బహుజన వర్గాల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. అగ్రకుల రాజకీయ పార్టీలు బడుగు, బహుజన వర్గాలను అభివృద్ధికి దూరం చేస్తున్నాయని విమర్శించారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలనీ, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలనీ, కులాలవారీగా జనభాగణన జరగాలని గణేష్ భవాని డిమాండ్ చేశారు. సమావేశంలో ముందుగా చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి గణేష్‌భవాని, పితాని చిన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పలువురి నియామకం..

జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పితాని వెంకట్‌ను, నరసాపురం డివిజన్ అధ్యక్షుడిగా గుబ్బల సత్యనారాయణను, పాలకొల్లు నియోజకవర్గ ప్రచారకమిటీ అధ్యక్షుడిగా చింతపల్లి చరణ్‌ను, పోడూరు మండల యువజన విభాగం అధ్యక్షుడిగా గుత్తుల వెంకట నాగరాజును, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కాండ్రేకుల మణికంఠను, నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా దంపనబోయిన సాయికుమార్‌ను, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా గుబ్బల ఉదయభాస్కర్‌ను, పోడూరు మండల కార్యదర్శిగా జుత్తుగ దేవేందర్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు గణేష్‌భవాని సమావేశంలో తెలిపారు. శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, మామిడి సత్యనారాయణ, వింజరపు శంకరం, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పోడూరు: నేటి సమాజంలో అందరూ ఒత్తిడితో కూడిన జీవితాన్ని ఎదుర్కొంటున్నారనీ, దీనివల్ల చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయనీ, కాబట్టి ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ వేదాంతం పిలుపునిచ్చారు. జేసీఐ పాలకొల్లు రైసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం జిన్నూరు ఐడియల్ స్కూల్ ప్రాంగణంలో మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద, సామాన్య ప్రజలకు తగిన వైద్యసేవలు అందించే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మెగా శిబిరంలో ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, దంత, చర్మ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి ఆరోగ్య సూచనలు చెప్పారు. రోగులకు దంత వైద్య నిపుణురాలు డాక్టర్ మౌని కావలి, హెడ్ అండ్ నెక్ జర్జన్ డాక్టర్ జయదుర్గాదేవి రుద్రరాజు, ప్రసూతి వైద్యనిపుణురాలు డాక్టర్ ఉమాదేవి కావలి, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ సుభాషిణి జక్కంపూడి, డాక్టర్ ప్రశాంతి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ మీనా మణిదీప్తి, ట్రెజరర్ సవిత, సభ్యులు కౌసిక్, శిరీష, నీలిమ, ప్రదీప్, విష్ణు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గూడెం విద్యార్థికి గోల్డ్‌మెడల్



ఆంధ్రాయూనివర్సిటీ లో ఎం.ఫార్మశీలో బంగారు పతకం అందుకుంటున్న సాయి ప్రవల్లిక

తాడేపల్లిగూడెం: పట్టణానికి చెందిన సాయిప్రవల్లిక ఎం.ఫార్మశీకెమిస్ట్రీలో బంగారు పతకం అందుకున్నారు. శనివారం విశాఖపట్టణంలో జరిగిన స్నాతకోత్సవంలో ఈ పతకం అందుకున్నారు.ఈ సందర్భంగా ప్రవల్లికకు పలువురు ఉపాధ్యాయలు అభినందనలు తెలిపారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తణుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ పి.మణికుమార్‌పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ఈ సందర్భంగా పి.మణికుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్రహ్మర్షి పత్రీజీ ప్రభోదించిన శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం ప్రతిరోజూ చేయాలని, మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడాలని, పిరమిడ్ జ్ఞాన రత్నాలు, రామాయణంలో పాత్రలు, బుద్ధుని అష్టాంగ మార్గం, సంకల్ప శక్తి గురించి వివరించారు. జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, సబ్బారపు కమల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెంటపాడు ఎస్సైగా హరికృష్ణ



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందిస్తున్న పెంటపాడు ఎస్సై హరికృష్ణ

పెంటపాడు: పెంటపాడు ఎస్సైగా బి. హరికృష్ణ నూతనంగా భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను గూడెం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో కూడా సమర్ధవంతగా వ్యవహరించాలన్నారు.

తల్లిదండ్రులను దైవంతో సమానంగా చూడాలి



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: తల్లిదండ్రులను దైవంతో సమానంగా చూడాలని,వారి పట్ల నిర్లక్ష్యం తగదని ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్‌అసోసియేషన్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. ఆదివారం పడాలలోని జీవనసంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పేద వృద్ధులకు సాయం చేయాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కబేళాను పరిశీలిస్తున్న మునిసిపల్ అధికారులు

తాడేపల్లిగూడెం: సరైన మాంసం విక్రయించకుంటే కఠినచర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ హెచ్చరించారు. స్థానిక 17వ వార్డులోని కబేళాను ఆదివారం ఉదయం వెటర్నరీ అసిస్టెంటు సర్జన్ డాక్టర్ మహేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. జీవాలను పరిశీలించి, సదరు జీవాల మాంసం ఆరోగ్యంగా ఉందా లేదా అనే విషయా లను చూశారు. మాంసంపై సీలు, ముద్ర ఉండాలన్నారు. ముద్రలేని మాంసం విక్రయిస్తే చర్యాలు తప్పవని హెచ్చరించారు. నిబంధ నలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన ఎస్సై ఆదినారాయణ



మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సై ఆదినారాయణ

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఇరగవరం ఎస్సై డి.ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. భీమవరం సీసీఎస్ విభాగం నుంచి తణుకు నియోజకవర్గంలోని ఇరగవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి ఈనెల 9వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఆయన వెంట సీఐ సీహెచ్ ఆంజనేయులు ఉన్నారు.

'గూడెం'లో 19.0 మిల్లీ మీటర్ల వర్షపాతం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 19.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ ఆదివారం తెలిపారు. పెంటపాడు మండలంలో 11.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

తణుకు అర్బన్: తణుకు రాష్ట్రపతి రోడ్డులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువుతీరిన అభయాంజనేయస్వామికి ఆదివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు సత్యనారాయణాచార్యులు భక్తులచే 21 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు.